దేశం మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో ఉన్నప్పుడు సుబ్బారామయ్య ఆ కాలేజీలో అర్థశాస్త్రోపన్యాసకునిగా చేరాడు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో ప్రథమ శ్రేణిలో ఎకనామిక్స్ ఆనర్స్ ప్యాసై నేరుగా లెక్చరర్ అయ్యాడు. అతనికి మొదట్నుంచీ టీచింగ్ అభిరుచిగల, ఆసక్తిగల విషయం. అందుచేతనే ఐ.ఏ.ఎస్. పరీక్షలో నెగ్గి, ఇంటర్వ్యూలో ఉత్తీర్ణుడు కాగల నైపుణ్యాలు ఉన్నప్పటికీ కాలేజీ లెక్చరర్ ఉద్యోగం పట్లనే మొగ్గు చూపి, ఆ వృత్తికే రిటైర్ అయ్యేదాకా అంటిపెట్టుకొని వున్నాడు. అతనికంటె తక్కువ శాతం మార్కులు తెచ్చుకున్న మిత్రులు ఐ.ఏ.ఎస్. ప్యాసై ప్రిన్సిపల్ సెక్రటరీగానూ, ఐ ఆర్ ఎస్. తెచ్చుకొని ఇన్‌కంటాక్స్ కమీషనర్‌గానూ, మరొకతను కస్టమ్స్ కలెక్టర్‌గానూ ఉన్నారు. కాని సుబ్బరామయ్యకు ఏటా కొన్ని వందలమంది విద్యార్థులకు అర్థశాస్త్ర సూత్రాలను, ఆచరణలో వాటి ప్రభావాలను బోధించడంలోనే ఎక్కువ ఆత్మసంతృప్తి కలగసాగింది. కనీసం పిహెచ్.డి. చేసి అయినా విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవిని పొందుదామనే తలంపు అతనికి కలగలేదు.

తరగతి గది బోధనలో సుబ్బరామయ్య గొప్ప కీర్తిప్రతిష్ఠల్ని గడించాడు- అటు విద్యార్థుల్లో, ఇటు సహాధ్యాయుల్లో. అతని విద్యార్థుల్లో ప్రభుత్వంలో, పారిశ్రామిక సంస్థల్లో, విదేశీ సర్వీసుల్లో గొప్పగొప్ప స్థానాల్ని అధిష్ఠించినవారు ఎంతోమంది వున్నారు. వాళ్ళంతా కాలేజీ జీవితాన్ని నెమరువేసుకొనేటప్పుడు సుబ్బరామయ్య ఉపన్యాసాల్ని గుర్తుకుతెచ్చుకుంటూ వుంటారు. ఎవరు ఎప్పుడు సుబ్బరామయ్యకు తటస్థపడ్డా 'మాస్టరుగారూ! కులాసాయేనా!' అని ఆప్యాయంగా అడుగుతారు. అట్లా ఎవరైనా అడిగినప్పుడు తన జీవితం ధన్యమైనంతగా సుబ్బరామయ్య సంబరపడిపోతాడు.

సుబ్బరామయ్య అంత సులభంగా అర్థమయ్యే మనిషి కాదు. కేన్స్ వ్రాసిన 'ఎ ట్రిటైజ్ ఆన్ మనీ' అనే గ్రంథం అర్థంచేసుకోవడానికి ఎంత కష్టమో, సుబ్బరామయ్యను అర్థంచేసుకోవడం కూడా అంత కష్టమే. అతవ

**వ్యవహార జీవనం - 29**

బ్రహ్మచారి. రిటైర్‌మెంట్ కాబోతున్నా పెళ్ళి ప్రసక్తి ఎత్తడు. అతనికి స్నేహితులు బహుకొద్దిమంది మాత్రమే. అతనికి ఏ దురలవాటూ లేదు. కాఫీ తాగడు. వక్కపొడి తినడు. సిగిరెట్లూ, ఆల్కహాల్ డ్రింక్సూ, పేకాట మొదలైనవాటికి ఎన్ని మైళ్ళ దూరంలో వుంటాడో చెప్పడానికి లేదు. ఎప్పుడైనా సరదా పుడితే సినిమాకు వెళతాడు. అదైనా సంవత్సరానికి ఒకటో, రెండో.

సుబ్బరామయ్య 'సుగుణాల రాశి' అని అందరూ చెప్పుకుంటూ వుంటారు. అయితే అతను జీవితంలో బ్రహ్మచారిగా వుండిపోవడానికి కారణాల్ని మాత్రం రకరకాలుగా చెప్పుకోవడం కద్దు. అంటే చెడుగా కాదు. ఒక ప్రేమలో విఫలమై ఆజన్మాంతమూ పెళ్ళిచేసుకోకుండా ప్రతిజ్ఞపట్టాడనీ, అతనికి స్త్రీ జాతిమీద ద్వేషభావం పెరిగిపోయిందనీ, అతనికి నచ్చిన స్త్రీ యింతవరకు తటస్థపడలేదనీ– ఇట్లా. ఎవరైనా 'ఏం సుబ్బరామయ్యా! ఈ జన్మకు పెళ్ళి లేదా?' అని అంటే తామరాకుమీద నీటిబిందువులా చిరునవ్వు నవ్వి వూరుకుంటాడు. అంతేగాని సూటిగా సమాధానం చెప్పడు. ఏది ఏమైనా సుబ్బరామయ్యను గురించి ఎవ్వరూ ఎప్పుడూ చెడుగా చెప్పుకోవడం జరగలేదు.

సర్వీసులో చేరిన దగ్గర్నుంచీ సుబ్బరామయ్య ఆ టవున్లో ఒకే పేటలో ఒకే ఇంట్లో వుండసాగాడు. ఎనభై రూపాయల అద్దె మొదట్లో ఇచ్చేవాడు. ఇప్పుడు రెండొందల ఎనభై రూపాయల అద్దె యిస్తున్నాడు. అన్ని ఏళ్ళనుంచీ ఒకే హోటల్లో భోజనంచేస్తున్నాడు.

ఇంకా ఆరునెలలకు ఏభైఅయిదేళ్ళు వచ్చి రిటైర్ అవుతాడనగా సుబ్బరామయ్య జీవితంలో ఒక సంఘటన జరిగింది. అదో రకంగా దుర్ఘటనే! నెల రోజుల క్రితం పనిమనిషి మానేస్తే, ఇంటి యజమానురాలు మరో పనిమనిషిని కుదిర్చింది. ఆ పనిమనిషి పేరు సుందరమ్మ. వయస్సు ముప్పైఅయిదేళ్ళు వుంటాయి. ఎర్రగా, బొద్దుగా తడిసిన తవుడు బస్తాలా వుంటుంది. ఆమెకు అసలు మొగుడు ఎప్పుడో చచ్చాడు. ఇప్పుడు మొగుళ్ళు ఎంతమందో ఎవ్వరికీ తెలీదు. ఆమె చెడిపోయిన మనిషని ఇంటి యజమానురాలుకు తెలుసు. కాని గత్యంతరం లేక తాత్కాలికంగా మరో పనిమనిషి దొరికేదాకా పెట్టుకుందామని పెట్టుకుంది. అయితే ఆ విషయాన్ని ఆవిడ సుబ్బరామయ్యతో చెప్పలేదు.

సుబ్బరామయ్య ఇంట్లో చాలమంది పనిమనుషులు పనిచేశారు. అతనింట్లో పెద్దగా పని వుండదు. ఇల్లు వూడవడం, నీళ్ళు పట్టడం, బట్టలు ఉతకడంలాంటి

చిల్లరపనులే. ఆ పనులకే అతను నలుగురికంటే నాలుగు రూపాయలు ఎక్కువ యిస్తాడు.

ఎవ్వరిలో ఏనాడూ కనిపించని అందాలూ, ఆకర్షణలూ సుందరమ్మలో కనిపించాయి సుబ్బరామయ్యకు. ఆమె మాటతీరూ, నడక వొంపులూ, కళ్ళల్లో అనిర్వచనీయమైన ఆకర్షణా, ఆ వయసులో కూడా బిగువు సడలని రొమ్ముకట్టూ, ఇంకా ముడతలు పడని నడుమూ, గుండ్రటి భుజాలూ- ఏళ్ళతరబడి కాపాడుకొస్తూన్న సుబ్బరామయ్య బ్రహ్మచర్యంపై సవాలు చేయసాగాయి. ఎందుకో ఆమె ఇంకా అయిదునిముషాలపాటు ఇంట్లోనే వుంటే బావుంటుందనిపించసాగింది.

ఓ రోజు సాయంకాలం సుందరమ్మ "సినిమా కెళతాను, ఓ రెండు రూపాయలిప్పించండి బాబూ!" అంది.

"నువ్వొక్కదానివేనా! మరెవ్వరితోనైనానా?" అన్నాడు సుబ్బరామయ్య చమత్కారంగా.

"ఎవరొస్తే వాళ్ళతో" అంది సుందరమ్మ కళ్ళు సుతారంగా తిప్పి.

ఆ మాటల వెనుక అర్థం సుబ్బరామయ్యకు బోధపడలేదు. ఇంకొస్త ముందుకెళ్ళి 'ఆడవాళ్ళా? మగవాళ్ళా?' అని అడుగుదామనుకొని ధైర్యంచాలక అయిదురూపాయల నోటు ఆమె కిచ్చాడు సుబ్బరామయ్య. ఆమె పైట కొస్త తొలగించి వొయ్యారంగా చిరునవ్వు నవ్వి వొళ్ళంతా కదిలిస్తూ బయటకు నడిచింది.

ఆ రోజంతా సుబ్బరామయ్య ఆలోచనల్లో సుందరమ్మ సుందర విగ్రహమే ఈస్ట్‌మన్ కలర్‌లో మెదిలింది.

ఆ రాత్రంతా ఆలోచించి కొన్ని నిర్ణయాలకొచ్చాడు సుబ్బరామయ్య. సుందరమ్మ సౌందర్యం తనకు అందుబాటులో వున్న వస్తువు. ఆ వస్తువును తాను కోరుకోవాలేగానీ ఆమెనించి అభ్యంతరం ఉండదు. స్త్రీ అనుభవం ఇంత సులభసాధ్యమైనప్పుడు, అది అలభ్యం కానప్పుడు జీవితంలో ఒక్కసారి ఆ అనుభవాన్ని పొందడంలో తప్పేమిటి? కోర్కెకు వయస్సుతో నిమిత్తమేమిటి?

ఆ మరునాడు సుందరమ్మ వచ్చింది. తెల్లచీర, వాడిన మల్లెపూలు, 'బ్రా' లేని తెల్లటి వాయిల్ జాకెట్టు, సెక్స్ మ్యాగ్నెట్‌లా గోచరించింది. నడివయస్సులోని స్త్రీ సౌందర్యమంతా ఆమెలో మూర్తీభవించి వట్లుంది. సుబ్బరామయ్యలోని అర్థశాస్త్రపరిజ్ఞానం అదృశ్యమై, వాత్సాయనుని

కామసూత్రాలు స్ఫురణకొచ్చాయి. ఆడదాన్ని ఆలింగనం ఎరుగని అతని దృఢమైన శరీరంలో ఒక్కసారి కోర్కెల కామజ్వాల పుట్టుకొచ్చింది.

మంచం పక్కగా వొంగి కసు వూడుస్తున్న సుందరమ్మ రొమ్ముల సైజు అతనిలో ఉడుకురక్తం లాంటి ఉద్రేకాన్ని రగిల్చింది. వెంటనే సుబ్బరామయ్య ఆమెను కౌగిలించుకున్నాడు.

ఆ అవకాశంకోసం ఆజీలుగా వున్నట్టు సుందరమ్మ ముసిముసి నవ్వులు నవ్వుతూ సుబ్బరామయ్య బాహువుల్లో రబ్బరుబొమ్మ అయిపోయింది. ఎన్ని నిముషాలు గడిచాయో తెలీదు. అరగంట తర్వాత ఆమె బయటికి వెళ్ళేటప్పుడు యాభై రూపాయల నోటు యిచ్చాడు సుబ్బరామయ్య. ఆ నోటును అతని ముందే నిస్సిగ్గుగా జాకెట్‌లో దోపుకుంది.

ఆరోజు మధ్యాహ్నానికి గానీ సుబ్బరామయ్యకు తెల్విరాలేదు- తాను జీవితంలో మొదటిసారిగా చేసిన తప్పు సంగతి. అప్పట్నుంచీ అతనికి మతి భ్రమించసాగింది. వెంటనే సెలవుపెట్టి కాలేజీనుంచి ఇంటికొచ్చాడు.

ముసిముసి నవ్వులతో పనిచేయటానికి ఇంటికొచ్చిన సుందరమ్మతో, "ఇక నువ్వు మా ఇంట్లో పనికి రానక్కర్లేదు" అని నిర్మొహమాటంగా చెప్పాడు.

సుందరమ్మ వెంటనే కొయ్యబారిపోయినా, ఆ తర్వాత తేరుకొని కోపం తెచ్చుకుంది. సుబ్బరామయ్య తనని ఒంటరిగా బలవంతం చేయబోయాడని ఆ వీధిలో టాంటాం వేసింది. ఆ వార్త గాలికంటే వేగంగా కాలేజీని చేరింది. క్లాస్‌రూం బోర్డుకూడా ఎక్కింది.

సుబ్బరామయ్య తల వొంచుకున్నాడు. తన బలహీనతకు తనే పశ్చాత్తాపాగ్నిలో క్రుంగిపోయాడు.

ఆర్నెల్లు ముందుగా ఉద్యోగంనుంచి రిటైర్ అయ్యాడు సుబ్బరామయ్య. పాల్ శామ్యూల్‌సన్ ఆర్థిక సిద్ధాంతాలపై పరిశోధన మొదలెట్టాడు.

*వ్యవహార జీవనంలో మన సుగుణాలకంటే దుర్గుణాలే ఎక్కువగా ఇతర్లను ఆకర్షిస్తాయి.*

---